క్లుప్తంగా

'వేదిక్' విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరంలో వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ వర్సిటీలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 65మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కేహెచ్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ రక్తదాన విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ బాబు నేతృత్వంలో బ్లడ్‌బ్యాంక్ వైద్యుల సలహా మేరకు విద్యార్థులు ఉత్సాహంగా రక్తదానం చేశారని తెలిపారు. వైద్యులు ప్రవీణ్, జీవా, శ్రావణి పాల్గొన్నారు

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న శ్రీవారి దేవేరి

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. సిరులతల్లిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు



దుస్తులు పంపిణీ చేస్తున్న మస్తాన్ తదితరులు

తిరుపతి కల్చరల్ : రంజాన్ సందర్భంగా ఏ–1 కేటరింగ్ అధినేత మస్తాన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. మస్తాన్ మాట్లాడుతూ ఏటా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్నట్లు వెల్లడించారు. అల్తాఫ్ హుస్సేన్ సాహెబ్, దస్తగిరి, డాక్టర్ శ్రీహరి, చంద్రారెడ్డి, దీపక్ యాదవ్, గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవిందుని గుడిలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత పార్థసారథి స్వామి వారు మాడ వీధుల్లో విహరించనున్నారు. 4, 18వ తేదీల్లో ఆండాళ్ అమ్మవారు, 6న పట్టాభిరామస్వామివారు , 12న గరుడ వాహనంపై శ్రీగోవిందరాజస్వామి వారు, 22న ఉభయ దేవేరీ సమేతంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 23 నుంచి మే 2వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా గజేంద్ర



గెలుపొందిన న్యాయవాదులు

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడిగా గొట్టి గజేంద్ర ఎన్నికయ్యారు. తిరుపతి కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదుల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 1,062 మంది న్యాయవాదులకు గాను 838 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఓ మునెయ్య, ప్రధాన కార్యదర్శిగా విద్యానాథరెడ్డి, మహిళా సభ్యురాలిగా కోమలాదేవి, సంయుక్త కార్యదర్శిగా టి.చంద్రమోహన్, కోశాధికారిగా జి.రాజేష్, గ్రంథాలయ కార్యదర్శిగా వి.సునీల్ కుమార్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా వి.నాగరాజా ఎన్నికయ్యారు. ఉషా కిరణ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గెలుపొందిన అభ్యర్థులకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని గజమాలతో సన్మానించారు

దేవభాష కీర్తిపతాకను ప్రపంచస్థాయిలో ఎగురవేయాలి. సంస్కృతం విశిష్టతను విశ్వవ్యాప్తం చేయాలి. విద్యార్థుల ఉన్నత భవితకు దిశానిర్దేశం చేయాలి. ఇదే లక్ష్యంతో జాతీయ సంస్కృత యూనివర్సిటీలో ఆల్ ఇండియా టాలెంట్ ఫెస్ట్ ఏర్పాటు చేశారు. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ప్రతిభను చాటుకునే అవకాశం కల్పించారు. విభిన్న అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బంగారు పతకాలు బహూకరించారు. ఉద్యోగ.. ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత దక్కేందుకు మార్గం సుగమం చేశారు.

- జాతీయ సంస్కృత వర్సిటీలో ఆల్ ఇండియా టాలెంట్ ఫెస్ట్
- 20 విశ్వవిద్యాలయాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు
- ప్రతిభ చూపిన వారికి పతకాలు.. బహుమతులు
- నేటితో పరిపూర్ణం కానున్న సంస్కృత పోటీలు

న్యాయ నిర్ణేతల సమక్షంలో వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థి



సృజనాత్మక సంబరం

తిరుపతి సిటీ : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీడమమే ప్రధాన లక్ష్యంగా జాతీయ స్థాయి టాలెంట్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రెండో రోజు జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్ ఫెస్ట్‌లో పలు విభాగాలకు సంబంధించి పోటీలను నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ 20వర్సిటీల నుంచి సుమారు 250మందికిపైగా విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ మేరకు టాలెంట్ ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కనుంది. దీంతో పాటు జాతీయ సంస్కృత వర్సిటీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు రిజర్వేషన్ కల్పించడం విశేషం.

గర్వంగా ఉంది



జాతీయ స్థాయి టాలెంట్ పోటీలలో పాల్గొనే అవకాశం దక్కడం గర్వంగా ఉంది. వక్తృత్వ పోటీలలో వ్యాకరణ, సాహిత్య వేదాంత విభాగాలలో సత్తా చాటాం. ఈ అవకాశం కల్పించిన యూజీసీకి, వర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు

- విమల్ తివారీ, గిరీష్ చంద్ర భట్, కేంద్రీయ సంస్కృత వర్సిటీ, న్యూఢిల్లీ

ప్రతిభకు గుర్తింపు



నేషనల్ టాలెంట్ ఫెస్ట్‌లో పాల్గొని భావ వ్యక్తీకరణతో పాటు, సంస్కృత శాస్త్రాలలో విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ఇది మాలాంటి పీజీ విద్యార్థులకు ఎంతో అవసరం. నిపుణులైన న్యాయ నిర్ణేతలు మా ప్రతిభను గుర్తించడం సంతోషకరం

- నందన, జీవన కుమారి, రాజీవ్ గాంధీ క్యాంపస్, శృంగేరి, కర్ణాటక

పరీక్షకు వేదిక



విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్రాలపై ఎంతవరకు పట్టు సాధించారనేది టాలెంట్ ఫెస్ట్‌లో బహిర్గతమవుతుంది. తెలియని ఎన్నో అంశాల పరీక్షకు చక్కటి వేదిక. ఆధునిక పరిజ్ఞానాన్ని పంచుకునేందుకు మంచి అవకాశం లభించింది

- లోకేష్ చంద్ర, నరేంద్ర ప్రతాప్ సింగ్, శ్రీరఘునాథకీర్తి క్యాంపస్, జయపూర్

చక్కటి అవకాశం



టాలెంట్ ఫెస్ట్‌లో పాల్గొనడం అదృష్టం. ఇందులో మన ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కటి అవకాశం లభించింది. శాస్త్రాల పరిశోధనలను షేర్ చేసుకునే వెసులుబాటు దక్కింది. ఉద్యోగ, ఉపాధిలో ప్రాధాన్యత కల్పించడం మరింత ఆనందం.

- గిరిజ, కృష్ణవేణి, పీజీ విద్యార్థులు, ఎస్ఎస్‌యూ, తిరుపతి

నోటీస్ బోర్డు

- జాతీయ సంస్కృత వర్సిటీలో ఉదయం 9.30 గంటలకు ఆల్ ఇండియా టాలెంట్ ఫెస్ట్.
- అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు.
- శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సింహ, ముత్యపు మందిరి వాహనసేవలు.
- పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 గంటల నుంచి మహతి కళాక్షేత్రంలో గుడి సంబరాలు.
- ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహారదీక్షలు
- టీటీడీ పరిధిలోని ఆలయాల్లో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతి సిటీ : ఎస్వీయూ అధికారుల తీరుపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వివరాలు.. ఎస్వీయూ హోమ్ సైన్స్ విభాగం రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు నాయక్ గుండెపోటుతో వర్సిటీలో క్వార్టర్స్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన స్వస్థలం వైఎస్సార్ కడప జిల్లా కావడంతో మృత దేహాన్ని తరలించేందుకు సాయం చేయాలని కుటుంబీకులు కోరారు. అయితే వర్సిటీ అధికారులు మాత్రం కాలం చెల్లిన వాహనం పంపించారు. దీనిపై విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.34లక్షల విలువైన నూతన అంబులెన్స్‌ను యూనియన్ బ్యాంకు వారు విరాళంగా అందించిన విషయం గుర్తు చేశారు. ఉద్యోగి భౌతికకాయాన్ని అందులో తరలించకపోవడంపై భగ్గుమన్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. కొత్తవాహనంలో మృత దేహం పంపుతామని హామీ ఇచ్చి మోసం చేయడంపై మండిపడ్డారు.

ఎస్వీయూ ఈసీ సమావేశం

- పలు నిర్ణయాలకు ఆమోదం

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీ అప్పారావు అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ క్రమంలో వర్సిటీ ఆర్థిక కమిటీ తీసుకున్న పలు నిర్ణయాలకు ఈసీ ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా జీతభత్యాలు, పెన్షన్లకు సంబంధించి రూ. 226 కోట్లు, వర్సిటీలో చేపట్టిన రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు గాను రెండవ స్టేజ్ నిధుల కేటాయింపునకు అనుమతులు మంజూరు చేశారు. అలాగే వర్సిటీలో ఫార్మసీ కళాశాల నిర్మాణం, కొన్ని అత్యవసర ఇంజినీరింగ్ పనులు, పరీక్ష పేపర్ల మూల్యాంకనం రెమ్యూనరేషన్ పెంపునకు ఈసీ ఆమోదం తెలిపింది. కళాశాలలకు సాధారణంగా మంజూరు చేసే అఫిలియేషన్‌కు అనుమతించింది. సమావేశంలో కౌన్సిల్ కార్యదర్శి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి తరఫున ప్రభుత్వ కళాశాల డైరెక్టర్ భరత్ గుప్తా, ఆప్సీ చైర్మన్ ఆచార్య మధు మూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి అల్లాడ గౌతమ్, ఈసీ సభ్యులు ఆచార్య జి.పద్మనాభం రెడ్డి, సుగుణారెడ్డి, సీకామ్ అధినేత డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, ఆచార్య కె.సుమకిరణ్, డాక్టర్ కె.మంజుల, డాక్టర్ మొహిద్దీన్‌బాషా, డాక్టర్ సంధ్యారాణి, నారాయణబాబు, జ్యోతి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో 'రాణి'ంచాలి!



మాట్లాడుతున్న వీసీ ఉమ

తిరుపతి సిటీ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పిలుపు నిచ్చారు. శుక్రవారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 73వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పద్మావతి కళాశాల విద్యార్థినులు అకడమిక్ విద్యతో పాటు కోకరికులమ్ యాక్టివిటీస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడారు. అకడమిక్ విద్యలో బీఏ విద్యార్థులు 94 శాతం, బీకామ్ 98 శాతం, బీఎస్సీ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జ్ డాక్టర్ బి.జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ జి.భద్రమణి, విశ్రాంత ప్రిన్సిపల్స్ సి.స్వరాజ్యలక్ష్మి, కె.మహదేవమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



మాట్లాడుతున్న శ్రీరామ్ రఘునాథ్

తిరుపతి కల్చరల్ : రాఘవేంద్రనగర్‌లోని సాయి దుర్గ బ్యాంకెట్ హాల్‌లో శుక్రవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ హాజరై ఉగాది ప్రాశస్త్యం, విశిష్టతను వివరించారు. శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ తెలుగు జాతికి తొలి పండుగ ఉగాది అని, కాలగమనంలో నేడు విశ్వావసు నామ సంవత్సరం వచ్చిందని వెల్లడించారు. ఈ సందర్భంగా కవులు రవి, గొల్లాపిన్ని సుబ్రమణ్యం, ధర్మయ్య, ధర్మరాజు, మహేష్‌బాబును ఘనంగా సత్కరించారు. సాంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన ఐదుగురితోపాటు వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఉగాది పచ్చడి పుస్తకాలను పంపిణీ చేశారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా



జేసీబీతో ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

చంద్రగిరి : మండలంలోని నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. టీడీపీకి చెందిన ఓ నేత కనుసన్నల్లో మొత్తం దందా నడుస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం సైతం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలించినట్లు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

తిరుపతి తుడా : పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ఆస్తి పన్నుపై వడ్డీ మినహాయింపు ఇవ్వాలని విలువ ఆధారిత ఇంటి పన్ను రద్దు చేయాలని, అర్హులందరికీ పెన్షన్లు, రేషన్‌కార్డులు అందించాలని సీపీఎం నేతలు కోరారు. శుక్రవారం ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఎస్.మాధవ్, ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, పి.చిన్న, ఆర్.మల్లికార్జునరావు, పి.రమేష్, చంద్రశేఖర్ నాయుడు, తంజావూరు మురళి, జి.వాసు, రాము, ప్రసాద్, బాదుల్లా పాల్గొన్నారు.

నాణ్యతగా 'స్మార్ట్‌సిటీ' పనులు



సమావేశంలో కమిషనర్ మౌర్య తదితరులు

తిరుపతి తుడా : నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని స్మార్ట్‌సిటీ చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్‌సిటీ ఎండీ, కమిషనర్ మౌర్య అధ్యక్షతన 38వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. నగరంలో సాగుతున్న అభివృద్ధి పనులను ఆమె వివరించారు. సమావేశంలో కలెక్టర్‌తోపాటు బోర్డు డైరెక్టర్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్రారెడ్డి, రమాశ్రీ , ఢిల్లీ నుంచి రవిచంద్ర వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఐసీసీసీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఈఈ రవి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు..

ప్రార్థనా శ్లోకాల పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో ×సర్వ దేవతా ప్రార్థనా శ్లోకాల్లు అనే పాకెట్ సైజు పుస్తకాన్ని వీసీ రాణి సదాశివమూర్తి, ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి ఈ పుస్తకాన్ని సంకలనం చేశారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ ఎస్పీ శ్రీనివాస్, ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ డీఎస్పీ బాలిరెడ్డికి అభినందనలు తెలిపారు.


సంకీర్తనలతో సామాజిక చైతన్యం



మాట్లాడుతున్న అధ్యాపకులు కృష్ణవేణి

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య సంకీర్తనలతో సామాజిక చైతన్యం పెంపొందుతుందని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు సర్వోత్తమరావు తెలిపారు. అన్నమయ్య 522వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో చేపట్టిన సాహితీ సదస్సు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తనలు–సామాజిక దృష్టి అనే అంశంపై ఉపన్యసించారు. అన్ని వృత్తుల వారు సమానమేనని అన్నమయ్య తెలియజేశారన్నారు. గృహస్థాశమ గొప్పదనాన్ని వివరించారని చెప్పారు. సంకీర్తనల్లో రాయలసీమ మాండలికానికి పెద్దపీట వేశారని కొనియాడారు. అన్నమయ్య –సంకీర్తనలు– పురాణ గాథలు అనే అంశంపై తెలుగు అధ్యాపకులు కృష్ణవేణి ప్రసంగిస్తూ 64 కీర్తనలలో శ్రీనారసింహస్వామిని కీర్తించినట్లు తెలిపారు. పోతన–అన్నమయ్య అనే అంశంపై ఆచార్య డాక్టర్ నల్లన్న మాట్లాడుతూ పపోతన పద్య రచనతో అన్నమయ్య పద సాహిత్యం ద్వారా దేవదేవుని కీర్తించారని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆనందభట్టర్ బృందం ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల వాయిద్య సంగీత కచేరి అలరించింది. అలాగే బుల్లెమ్మ బృందం గాత్ర కచేరి శ్రవణానందకరంగా సాగింది. కార్యక్రమంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఇన్‌చార్జి సంచాలకుడు కె.రాజగోపాలరావు పాల్గొన్నారు.

'రాసాని'కి ఉగాది పురస్కారం



తిరుపతి కల్చరల్ : బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వీఆర్ రాసాని ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందించనుంది. రాసాని 14 నవలలు, 10 కథా సంపుటాలు, 8 విమర్శనాత్మక కథనాలు, 35 నాటికలు, 50 గ్రంథాలు రచించడం విశేషం.

ఏడుగురికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి వాహనాలు నడిపి కేసుల్లో ఏడుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

ప్రాణం కాపాడిన పోలీసులు

తిరుమల : తిరుమల పాండవతీర్థంలో శుక్రవారం ఆత్మహత్యకు యత్నించబోతున్న యువకుడిని పోలీసులు రక్షించారు. బెంగళూరుకు చెందిన చేతన్(24) ఇంటి నుంచి అలిగి ఐదు రోజుల క్రితం తిరుమలకు వచ్చేశాడు. ఈ క్రమంలో యువకుడి తల్లిదండ్రులను పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ కుమారుడిని కాపాడినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: టీటీడీ సహకారంతో పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించనున్న గుడి సంబరాలు కరపత్రాలు ఆవిష్కరించారు. శుక్రవారం ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ ప్రతినిధి ప్రమోద్ మాట్లాడుతూ సంబరాల్లో భాగంగా 200 కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. సమావేశంలో నవీన్, పార్థసారథి పాల్గొన్నారు.

పశువుల బ్రీడింగ్‌పై అవగాహన



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి : మండలంలోని నారావారిపల్లెలో శుక్రవారం పశువుల ఎద క్రమబద్ధీకరణ (బ్రీడింగ్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ అధికారులు మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉంటేనే అధిక పాల దిగుబడి వస్తుందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు రకాల మందులను పంపిణీ చేశారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

చంద్రగిరి : ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు రుయాలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాలు.. మండలంలోని బందార్లపల్లెకు చెందిన ఎరుగింటి జయమ్మ(79) కడుపునొప్పి తాళలేక ఈ నెల 26వ తేదీన పురుగుల మందు తాగేసింది. ఈ క్రమంలో మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు నాగయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : చిత్తూరు నాగయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి శుక్రవారం రంగస్థలి కార్యాలయం వద్ద ఘనంగా నివాళులర్పించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి చిత్తూరు నాగయ్య తన సంపాదనలో అధిక శాతం ధాన ధర్మాలకు ఉపయోగించారని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు కేఎస్ రాజా, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పద్మనాభం, నాగేశ్వరరావు, చెంగల్రాయులు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వార్డు సెక్రటరీల బదిలీ

తిరుపతి తుడా: పలువురు వార్డు సెక్రటరీలను కుప్పం సచివాలయాలకు బదిలీ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అనంతపురం రీజనల్ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 27 మంది సెక్రటరీలను కుప్పానికి బదిలీ చేయగా అందులో తిరుపతి నుంచి 9 మంది ఉన్నారు.